## క్లుప్తంగా

### డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

నారాయణఖేడ్: పట్టాపాసు పుస్తకం లేకపోయినా భూమి పట్టా ఇతరుల పేర మార్చిన నిజాంపేట డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు చిరంజీవి, అశోక్, ప్రేమ్, ఆనంద్ తదితరులు గురువారం ఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన నిజాంపేటలో ఒరిజినల్ పట్టా పాసు పుస్తకం లేకపోయినా13(బీ) విధానంతో భూమిని రిజిస్ట్రేషన్ చేసి బాధితురాలికి అన్యాయం చేశారన్నారు. దీంతో వెంటనే నిజాంపేట డిప్యూటీ తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాప్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి 85 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీలోని కూల్ డ్రింక్ షాప్‌తో పాటు మరో ఇంట్లో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి ఎస్‌ఐ సోమేశ్వరి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు చోట్ల 85 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకొని రంగ, దుర్గారెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

### నగదు బహుమతులు ప్రదానం




బహుమతులు అందుకున్న విద్యార్థినులు

రామచంద్రాపురం(పటాన్ చెరు) :తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మొత్తం మార్కులు సాధించిన విద్యార్థులకు దివంగత కృష్ణమూర్తి–పుష్పవతి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురువారం 10 మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో ఉన్న కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏటా ఈ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయాలి

కంది(సంగారెడ్డి): ఓటరు స్లిప్పులను ఈ నెల 30 లోగా బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి అందజేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఓటరు స్లిప్పులను అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లందరికీ స్లిప్పులు తప్పకుండా అందేలా చూడాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలిస్తూ స్లిప్పులను పంపిణీ చేసిన ఓటర్ల పేర్లను రిజిస్టరులో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బీఎల్‌ఓలతో కలిసి సమన్వయంతో ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): అంబేడ్కర్ చూపిన మార్గంలో యువత నడుచుకోవాలని అంబేడ్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకుడు మొగులయ్య గౌతమ్ అన్నారు. మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంలో యువత ముందుకు నడిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, విఠల్, వైజ్యనాథ్, దశరథ్, బాల్‌రాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు.. ఎండమావు

- ఏటా చెరువులు నిండినా.. పంటలకు అందని నీరు
- పదేళ్లుగా చేపట్టని సాగునీటి కాల్వల నిర్మాణం
- అరకొర నిధులతో మిషన్ కాకతీయ పనులు
- మరమ్మతులకు నోచుకోని కాల్వలు
- ముంచుకొస్తున్న వానాకాలం పంటల సీజన్



ఆనవాళ్లు కోల్పోయిన కాకివాగు ప్రాజెక్టు సాగు కాలువ

**చెరువుల కింద ఆయకట్టు రైతులకు సాగునీరు ఎండమావుగా మారింది. ఏటా చెరువులు నిండుతున్నా పంటల సాగుకు నీరు అందడంలేదు. ఏటా వర్షాలు పడే సమయానికి ఉపాధిహామీ పథకంలో భాగంగా తూతూ మంత్రంగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి నీరు వదలడం అధికారులకు ఆనవాయితీగా మారింది. కాలువల ఆనవాళ్లు కోల్పోయి 20 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేనాథుడు కరువయ్యాడు. పూర్తిస్థాయిలో సాగునీటి కాలువలు నిర్మించాలని అధికారులు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.**

– కంగ్టి(నారాయణఖేడ్)

కంగ్టి మండల పరిధిలోని దామర్‌గిద్దా కాకివాగు ప్రాజెక్టు కింద 1030 ఎకరాల ఆయకట్టు ఉంది. మొదటి విడత మిషన్ కాకతీయలో భాగంగా రూ.94.32 లక్షలు మంజూరయ్యాయి. దీంతో చెరువుల పూడికతీత, కట్ట ఎత్తు పెంపు, అలుగు పటిష్టం చేసేందుకు స్కిన్‌వాల్ నిర్మాణంతో పాటు ఆయకట్టు చివరలో కొంత మేరకు కాల్వల నిర్మాణం చేపట్టారు. చెరువు తూము వద్దే కాల్వలు సక్రమంగా లేకపోగా చివరి ఆయకట్టు వద్ద కాల్వలు సీసీతో నిర్మించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

**అరకొరగా మిషన్ కాకతీయ నిధులు**

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో ముర్కుంజాల్ సోమిల్లవాగు ప్రాజెక్టు కింద 289 ఎకరాలు కాగా రూ.79.4లక్షలు, ఘన్‌పూర్ పెద్ద చెరువు కింద 90 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ చెరువుల అభివృద్ధికి రూ.65.42 లక్షలు నిధులను మాత్రమే అరకొరగా మంజూరు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులకు మహర్దశ పట్టనుందని రైతులు భావించిన ప్రయోజనం లేకుండా పోయింది.

**రైతుల ఆశలు ఆవిరి**

ఏటా ఆయకట్టు విస్తీర్ణం తగ్గుతూ రావడంతో రైతులు చెరువు నీటిపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆయకట్టు భూములకు ఒక్క గుంటకు నీరందకున్నా అధికారులే బాధ్యత వహించాలంటూ గత ప్రభుత్వం ప్రకటనలు గుప్పించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటి అధికారులు సైతం చెరువుల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా ప్రతిపాదనలు పంపడంతో అరకొర నిధులు విడుదలయ్యాయని ఇరిగేషన్ సిబ్బందే తెలపడం విడ్డూరంగా ఉంది.

**తూతూ మంత్రంగా సాగునీటి కాలువల పూడికతీత పనులు**

ఏటా వర్షాలు పడే సమయానికి ఉపాధిహామీ పథకంలో భాగంగా అధికారులు తూతూ మంత్రంగా సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి నీరు వదలడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం అధికారులకు ఆనవాయితీగా మారింది. ఫలితంగా సాగునీటి కాల్వలు ఆనవాళ్లు కోల్పోవడంతో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో కాలువలను నిర్మించకపోవడంతో రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సాధుతండా శివారులోని కాలువను కొలత తీసుకుంటున్న అధికారులు(ఫైల్)

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం**



రాబోయే వానాకాలం సీజన్‌లో సాగుకు నీరందేటట్లు చర్యలు తీసుకొంటాం. ఆయకట్టు అంతటికీ సాగు నీరు అందడంలేదు. కాల్వలు పునర్నిర్మాణం చేస్తే తప్ప నీరు అందించని పరిస్థితి ఉంది. చెరువుల తూములు, అలుగులు, సైఫన్లు, కాలువలను పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను నివేదిస్తాం. వారి ఆదేశాలకు అనుగుణంగా కాలువల నిర్మాణాలు చేపడతాం.

– మైలారం రవి, ఇరిగేషన్ ఏఈ, కంగ్టి

# వెంకట్రామిరెడ్డికి పట్టం కట్టండి

**ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**

పటాన్‌చెరు: సమర్థుడు, పరిపాలన అనుభవం కలిగిన వెంకట్రామిరెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ నివాసంలో గురువారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 28న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అమీన్‌పూర్ మున్సిపల్, మండల స్థాయి మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం మెదక్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, బాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రామిరెడ్డికి మద్దతుగా ఈ నెల 27న నిర్వహించనున్న భారతినగర్, రామచంద్రాపురం డివిజన్ల మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన భారతినగర్, రామచంద్రపురం డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధిని గడపగడపకు వెళ్లి వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి

**మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు**



కాలనీవాసులతో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి పీఈఎస్ కాలనీలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. నాడు కాంగ్రెస్ హయాంలోనే ఇక్కడ కాలనీ ఏర్పాటు అయిందన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి ఎన్నో పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి అవకాశాలను కల్పించారని గుర్తు చేశారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు, యూత్ సభ్యులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, రుద్రారం లక్డారం మాజీ సర్పంచ్‌లు వెంకన్న, రాజిరెడ్డి, అశోక్, గోపిగౌడ్, సందీప్, నాని పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



జిన్నారం: కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలతో కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండల పరిధిలోని కొడకంచి ఎంపీటీసీ సంతోష్‌తో పాటు మరో 50మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. వ్యవస్థలను సైతం మాజీ సీఎం కేసీఆర్ నాశనం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతిఒక్కరికీ తగిన ప్రాధాన్యతనిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జానాబాయి, మహేష్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

నారాయణఖేడ్: విద్యార్థి ఉద్యమ నాయకులు, బీఆర్‌ఎస్ ఖేడ్ పట్టణ మాజీ అధ్యక్షుడు ఇస్తారి మహేష్‌రామ్, ఖేడ్ మండలం పీర్లతండా తాజా మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు బిక్కుసింగ్, శ్రీనుకుమార్, విఠల్‌లతో పాటు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా పెద్దశంకరంపేట మండలం చీలపల్లికి, ఉత్తులూరుకు చెందిన 250 మంది బీఆర్‌ఎస్ నాయకులు ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులు**

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌కు నాయకులు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల నాయకులు మన్నె వెంకటేశం ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట: నిర్మలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎండీ లతీఫ్

**కాంగ్రెస్‌లో చేరిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ లతీఫ్**

సదాశివపేట(సంగారెడ్డి): మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ లతీఫ్ బుధవారం సంగారెడ్డిలో టీజీఐఐఎఫ్ చైర్మన్ నిర్మలారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, వసీం, ఖలీల్, సాబేర్, వాజిద్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు,



నారాయణఖేడ్: కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్



హత్నూర: పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న నీలం మధు ముదిరాజ్

# పేరుకే మోడల్.. ఫలితాల్లో ఢమాల్

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యను బలోపేతం చేస్తున్నామని గొప్పలు చెప్పే పాలకులు మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ కళాశాల ఇంటర్ ఫలితాలను చూస్తే పరిస్థితి ఇట్టే అర్థమవుతోంది. మోడల్ కళాశాలల్లో ఆధునిక వసతులు, సరిపడా విద్యాబోధన సిబ్బంది చరవాణిలో తల్లిదండ్రులను సంప్రదించినా ఆశించిన మేర ఫలితాలు రాలేదు. మొదటి సంవత్సరంలో 78 మంది విద్యార్థుల్లో 28 శాతం మాత్రమే ఉత్తీర్ణత అనగా 22 మంది విద్యార్థులే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 66మంది విద్యార్థులకు గాను 33మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో ఉత్తీర్ణత 53 శాతంగా నమోదు కావడం అందరిలోనూ నిరాశను కలిగించింది. మోడల్ కళాశాల విద్యపట్ల తల్లిదండ్రులు నిరుత్సాహం వ్యక్తమవుతోంది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ మల్లికను వివరణ కోరగా రాష్ట్ర మోడల్ కళాశాలల అడిషనల్ డైరెక్టర్ ఆదేశానుసారం విద్యార్థులకు రెగ్యూలర్‌గా పరీక్ష టెస్టులను నిర్వహించాం. కానీ.. విద్యార్థులు సరిగా కళాశాలకు హాజరు కాకపోవడంతోనే ఇలాంటి ఫలితాలు వచ్చాయని, రెగ్యూలర్‌గా వచ్చిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సప్లమెంటరీ పరీక్షల్లో అందరూ విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామని బదులిచ్చారు.



పోతులబోగుడా మోడల్ కళాశాల

# ఆటోడ్రైవర్ కూతురు మండల టాపర్

- దాతలు సహకరిస్తే డాక్టర్ అవుతా
- విద్యార్థిని ఉమా తెహరిన్

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లి గ్రామానికి చెందిన గౌసోద్దీన్‌ది నిరుపేద కుటుంబం. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చిన డబ్బులతో ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఉండటానికి ఇళ్లు కూడా లేకపోవడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన డబల్ బెడ్ రూం ఇంట్లో ఉంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. తాను అనుకున్నట్లే తన పెద్ద కూతురు ఉమా తెహరిన్ ఇంటర్మీడియట్‌లో 934 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తన పిల్లలను డాక్టర్ చేయాలనే పట్టుదలతో తల్లి రజీయసుల్తానా, తండ్రి గౌసోద్దిన్ రెక్కలు ముక్కలు చేసుకొని ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులతో ఉన్నత చదువులు చదివించేందుకు సిద్ధమయ్యారు. కష్టకాలంలో ఉన్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. ఉమా తెహరిన్ మాట్లాడుతూ తాను డాక్టర్ కావడానికి సహకరించేందుకు దాతలు ముందుకు వస్తే ఎంత కష్టమైనా విజయం సాధించి పేద ప్రజలకు సేవ చేస్తానని తెలిపింది.



తల్లిదండ్రులతో విద్యార్థిని ఉమా తెహరిన్

## సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మొగులమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కచూర్‌రావు, నాయకులు వీరప్ప, మొగలయ్య, ప్రవీణ్‌గౌడ్, కల్యాణ్, సురేష్, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

◆ **ఓటరు స్లిప్‌ల పంపిణీ**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యాల్‌కల్‌తో పాటు ఆయా గ్రామాల్లో అధికారులు ఓటరు స్లిప్‌ల పంపిణీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూపాల్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 48,163 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. స్లిప్‌లను ఈ నెల 27లోపు పూర్తి చేయాలని సూచించారు.

◆ **జైపాల్‌రెడ్డితో ఎంపీ బీబీ పాటిల్ భేటీ**

జహీరాబాద్: డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డితో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గురువారం హైదరాబాద్‌లోని జైపాల్‌రెడ్డి నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనకు రాబోయే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరగా జైపాల్‌రెడ్డి సమ్మతించినట్లు బీబీ పాటిల్ పేర్కొన్నారు.

◆ **ప్రగతి పత్రాలు అందజేత**

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం ప్రగతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి చిన్నారుల తల్లితండ్రులు, పోషకులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా రుద్రాభిషేకం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంలోని శ్రీకృష్ణానంద ఆశ్రమంలో రంగంపేట పీఠాధిపతి మాధవానందస్వామి సరస్వతి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేపట్టారు. ప్రతిఒక్కరు హిందూధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని మాధవానంద సరస్వతి భక్తులకు సూచనలు చేశారు.

◆ **సాయిబాబా ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇశ్రితాబాద్ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాములు, సభ్యులు పాల్గొన్నారు.

◆ **పోషకాహారంపై అవగాహన**

మునిపల్లి(అందోల్): అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహారంపై పిల్లోడి అంగన్‌వాడీ సెంటర్ అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర అవగాహన కల్పించారు. చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి**

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయి కుమార్ అన్నారు. ఈ మేరకు జెడ్పీటీసీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, ఉపాధ్యక్షుడు భాస్కర్, యువత అధ్యక్షుడు అనంద్, నాయకులు అంజన్న, బాగన్న పాల్గొన్నారు.

◆ **జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని దేవునూర్ రైతువేదిక భవనంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏఓ మహేశ్ చౌహాన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఖాదిరాబాద్ పీఏసీఎస్ సీఈఓ శ్రీకాంత్, సిబ్బంది ఎల్లారెడ్డి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

◆ **బీబీ పాటిల్‌ను గెలిపించాలి**

పుల్‌కల్(అందోల్): రాబోయే ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆలే భాస్కర్‌రాజ్ అన్నారు. పుల్‌కల్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు రమేష్ బస్వరాజ్, చంద్రశేఖర్, పండరి పాల్గొన్నారు.

◆ **బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం**



జహీరాబాద్: మున్సిపల్ పరిధిలో బీజేపీ మహిళా నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకురాలు వచనా పాటిల్, మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణ కౌళాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి, నాయకులు మంజుల కౌళాస్, శోభ, అనితస్వామి, అర్చన సారడా, కృష్ణారెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.